ఇక ఏరోజుకు ఆ రోజే శ్రీవారి దర్శనం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఇకపై రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితికి తిరుమల తిరుపతి దేవస్థానం చెక్ పెట్టనుంది. ఇప్పటి వరకు శ్రీవారి దర్శనం.. వివిద ఆర్జిత సేవలు చేసుకోవాలని పరితపించిపోయే భక్తులకు దర్శనం నుంచి సేవల వరకు వేచిచూడాల్సిన పరిస్థితి ఉన్న విషయం విదితమే. తిరుమల దేవదేవుని దర్శనం దుర్లభమనే మాట నానుడిగా మారిపోయింది. అలాంటి పరిస్థితి నుంచి ఇప్పుడు వడివడిగా.. శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని తిరుమల తిరుపతి పాలకమండలి బోర్డు భక్తులకు కల్పిస్తోంది. ఉదయం టికెట్ తీసుకుని మధ్యాహ్నం భోజనం చేసి.. కొద్దిసేపు కుదిరితే విశ్రాంతి తీసుకుని.. సాయంత్రానికి శ్రీవారి దర్శనం చేసుకునే విధానాన్ని త్వరలోనే ప్రవేశ పెట్టనున్నట్టు టీటీడీ బోర్డు యోచిస్తోంది. దీనివల్ల భక్తులకు.. విలువైన సమయం వధాకాకుండా ఉండడంతోపాటు.. తిరుమలలో రద్దీ కూడా తగ్గుముఖం పడుతుంది. అంతేకాదు .. శ్రీవారి దర్శనం కోసం వచ్చి.. రోజుల తరబడి వేచి ఉండడంతో హెూటళ్ల అద్దెలకు, భోజనాలకు వెచ్చించే సొమ్ములు కూడా మిగులు తాయి.

అంగన్‌వాడీల నిరసనలతో హోరెత్తిన జిల్లా

- 'ఎఫ్ఆర్ఎస్' యాప్‌ను రద్దు చేయాలి
- కనీస వేతనం రూ.26వేలివ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

'ఎఫ్ఆర్ఎస్' యాప్‌ను రద్దు చేయాలని, అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ గురువారం తిరుపతి జిల్లాలో అంగన్‌వాడీలు నిరసనలు తెలిపారు. చంద్రగిరి టవర్‌క్లాక్ వద్ద యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వాణిశ్రీ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. జిల్లావ్యాప్తంగా మానవహారాలు హోరెత్తాయి. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నల్లచీరలతో నిరసన తెలిపారు.

చంద్రగిరిలో..

తిరుపతిలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద యూనియన్ నగర కార్యదర్శి నాగరాజమ్మ, అధ్యక్షురాలు జయప్రభ, సిఐటియు నేత కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదని, రాష్ట్రంలో 2019 నుంచి పెంచలేదని, వేతనాలు పెంచకపోగా పనిభారం విపరీతంగా పెంచారన్నారు. 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జులైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారు. అయినా పట్టించుకోలేదని వాపోయారు. అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు, పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్స్ అమలుకు సపోర్టు చేయడం లేదన్నారు. ఫొటోక్యాప్చర్, ఒటిసి, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన ఇబ్బందిగా ఉందన్నారు. అన్ని యాప్లను ఒక్కటిగా మార్పు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.బుజ్జి, అంగన్‌వాడీలు గీత, వరలక్ష్మి, గోమతి, సుజిత పాల్గొన్నారు.

– వెంకటగిరి తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, ప్రాజెక్టు అధ్యక్షులు అరవ మంజుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గ్రామాల్లో యాప్‌లు ఓపెన్ కాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. నిర్మల, పూర్ణ పాల్గొన్నారు. డక్కిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో జరిగింది.

– చంద్రగిరిలో టవర్‌క్లాక్ వద్ద యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వాణిశ్రీ, సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర ఆధ్వర్యంలో జరిగింది. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుగంధర్, నాగరత్నమ్మ, పద్మజ, స్వాతి పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఐఎఫ్‌టియు నాయకుల ఆధ్వర్యంలో జరిగింది. 5జీ మొబైల్ ఫోన్లు అందించాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, గురునాథం, రేవతి, ఐఎఫ్టీయూ నాయకులు భారతీ తదితరులు పాల్గొన్నారు.

– పుత్తూరులో తహశీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ వెళ్లి మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ , నాయకులు మునికుమారి, విజయ్‌కుమారి, కృష్ణవేణి, గంగులమ్మ, జయంతి, ధనమ్మ పాల్గొన్నారు. కెవిబిపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద యూనియన్ జిల్లా కోశాధికారి రాజేశ్వరి, సిఐటియు నాయకులు నాగలాపురం నాగరాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దేవి, రమణమ్మ, మునీశ్వరి, కృష్ణవేణి, శివశంకరి, జ్యోతి, యశోద, కవిత పాల్గొన్నారు. వరదయ్యపాలెం బస్టాండ్ ఆవరణలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. సిఐటియు నాయకురాలు శాంతి నేతృత్వంలో జరిగింది. బుచ్చినాయుడు కండ్రిగ ఎంపిడిఒ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు సుదర్శనదేవి, కృష్ణవేణి, ప్రమీల, కవిత పాల్గొన్నారు.

– నాయుడుపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లచీరలతో బ్లాక్‌డే పాటించారు. సిఐటియు నాయకులు శివకవి ముకుంద, అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.శ్యామలమ్మ, అధ్యక్షులు పుష్ప ఆద్వర్యంలో జరిగింది. కళావతి, మునిరత్నమ్మ, జానకి, సంధ్య, విజయమ్మ, వి.శ్యామల, స్వర్ణలత, మేరి పాల్గొన్నారు. చిట్టమూరులో నాయకులు వెంకటమ్మ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

– ఏర్పేడు– వెంకటగిరి కూడలి వద్ద బ్లాక్‌డే నిర్వహించి మానవహారం, ధర్నా చేపట్టారు. యూనియన్ నాయకురాలు భాగ్యమ్మ, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.రంగయ్య, సిఐటియు మండల కార్యదర్శి షేక్‌కరీముల్లా, వెంకటాద్రి, అంగన్‌వాడీలు పాండురంగమ్మ, లక్ష్మి, హేమ, మీన, అశోక్‌రాణి, కవిత, భూలక్ష్మి పాల్గొన్నారు.

వికలాంగ పింఛన్లన్నీ పునరుద్ధరించాలి

- కలెక్టరేట్ వద్ద వికలాంగుల నిరసన
- మధ్యాహ్నం వరకూ ఉద్రిక్తత
- సిపిఎం, వైఎస్ఆర్ కాంగ్రెస్ మద్దతు
- కలెక్టర్ హామీతో ధర్నా విరమణ

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

పింఛన్ల తొలగింపుపై వికలాంగుల నిరసనతో తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని, జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి తమతో మాట్లాడి హామీ ఇవ్వాలని వికలాంగులు పట్టుబట్టారు. గోవిందా గోవిందా న్యాయం చేయాలి గోవిందా అంటూ నినాదాలు చేశారు. ఎండ వేడిమి అధికం కావడంతో కలెక్టర్ కార్యాలయం ఆవరణలోకి వెళ్లడానికి ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఒక్కసారిగా కోపోద్రిక్తులైన వికలాంగులు వారి మూడు చక్రాల వాహనాలను రెండు గేట్లు వైపుగా అడ్డుపెట్టి వారు నేలపై పడుకుండి నినాదాలు చేస్తూ బైఠాయించారు. పోలీసులు నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. దీంతో జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయం నుండి వారితో సంప్రదించడానికి రావడంతో వికలాంగులు తాము కోల్పోతున్న పింఛన్లకు బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని, పింఛన్ల మీదే ఆధారపడి బతుకుతున్న తమ కుటుంబాలను రోడ్డున పడేయటం కూటమి ప్రభుత్వానికి ఎంత మాత్రమూ బాగోలేదని, సెప్టెంబర్ మాసానికి సంబంధించి పింఛన్లు ఆపకుండా ఇవ్వాలని డిమాండ్లు చేశారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఎట్టి పరిస్థితుల్లో పింఛన్లను నిలుపుదల చేయబోమని, అవసరమైతే జిల్లాకు వచ్చే నిధులనుండి వికలాంగులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సైతం తొలగించిన పింఛన్లను పునరుద్ధరిస్తూ సెప్టెంబర్ మాసానికి పింఛన్లు ఆగకుండా ఇవ్వడానికి ముందుకు వచ్చి భరోసా ఇవ్వాలని పట్టుబట్టారు. డిఆర్‌ఓ ఇది ప్రభుత్వ పాలసీకి సంబంధించిన విషయమని, ఎవరిని ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టే కార్యక్రమం కాదన్నారు. అయితే 'మీ జీతాల నుండి మాకు పింఛన్లు ఇస్తారా' అని వికలాంగులు అందరూ ఒక్కసారిగా ప్రశ్నించడంతో డిఆర్‌ఓ నరసింహులు పరిస్థితిని జిల్లాలో క్యాంపులో ఉన్న జిల్లా కలెక్టర్ దష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లారు.

వికలాంగుల నిరసనలో వి.నాగరాజు, అభినయ్‌రెడ్డి

డిఆర్డిఎ పిడి శోభన్ బాబు చెప్పినా.....

జిల్లా డిఆర్డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు వికలాంగులకు నచ్చజెప్పే ప్రయత్నాన్ని చేశారు. వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్ అనేది సక్రమ, శాస్త్రీయ మార్గంలో జరగలేదని, ఉద్యోగస్తులుగా ఏదైనా తప్పు చేస్తే సస్పెండ్ చేస్తారని, పింఛన్లపైనే ఆధారపడి బతుకుతున్న తమలాంటి వారిని ఇబ్బందులకు గురి చేస్తూ పింఛన్ల వెరిఫికేషన్ లో తప్పిదాలకు తావిచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఉద్యోగుల జీతాలు ఇవ్వకపోతే మీరు ధర్నాలు చేస్తారని, కేవలం పింఛన్లపై ఆధారపడి కుటుంబాల నడుపుకునే వికలాంగులమైన మేము నిరసనలు ధర్నాలు చేయకూడదా అని ప్రశ్నించారు. మళ్ళీ అప్పీలు చేసుకుంటే ఇప్పుడే ఎనిమిది నెలల కాలం పాటు ఈ పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ జరిగిందని, ఇంకెంత కాలానికి తమ పింఛన్లు పునరుద్ధరిస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు.పింఛన్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా వచ్చిన అధికారులు, సిబ్బంది తమను తాకకుండానే ఎలా నిర్ధారించారని దివ్యాంగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు మురళి ప్రశ్నించారు. వికలాంగురాలు సుమతి స్పృహ కోల్పవడంతో తిరుచానూరు సిఐ సునీల్‌కుమార్ తన వాహనంలో పద్మావతి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారు.

జిల్లా కలెక్టర్ హామీతో నిరసన విరమణ.....

సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూమన అభినయ రెడ్డిలు వికలాంగులకు మద్దతుగా నిలవడం, వారి తరపున పెద్ద ఎత్తున పోరాటానికి సన్నద్ధం అవుతామని ప్రకటిస్తుండగానే జిల్లా కలెక్టర్ ఫోను ద్వారా వికలాంగుల సమస్యలు పరిష్కరిస్తామని, జిల్లా కలెక్టరేట్లోనే రీ వెరిఫికేషన్ కు సంబంధించి కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా నిరసన కార్యక్రమాన్ని విరమింప చేస్తున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. సోమవారం జిల్లాలో ఉన్న వికలాంగులు అందరూ తరలి రావాలని, సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాడతామని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు వెల్లడించారు.

– ఏర్పేడు ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిపిఎం కార్యదర్శి షేక్‌కరీముల్లా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల వ్యాప్తంగా దాదాపు 250 మంది వికలాంగులకు కూటమి ప్రభుత్వం కడుపు కొట్టిందన్నారు. గతంలో సరదన్ సర్టిఫికెట్లలో 60–70శాతం ఉన్న వైకల్య శాతం, ప్రస్తుతం 10–20 శాతానికి ఎలా తగ్గిపోతుందన్నారు. సదరం సర్టిఫికెట్లు మోసపూరితంగా ఉన్నాయన్నారు. కె.రంగయ్య, వెంకటాద్రి, వికలాంగులు పాల్గొన్నారు.

కుప్పంలో కేంద్రీయ పాఠశాల

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కుప్పంలో కేంద్రీయ పాఠశాలను ఏర్పాటు చేయనున్నారు.. ఇందుకు సంబంధించి 7.5 ఎకరాలను ప్రభుత్వం కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అలాగే ఎన్నికల హామీలో భాగంగా అంగన్వాడీలకు రిటైర్మెంట్ వయసు 62 కు చేరుస్తూ మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఎన్నికల వాగ్దానాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 62 సంవత్సరాల వయస్సు నిండిన అంగన్‌వాడీ వర్కర్లు , అంగన్‌వాడీ హెల్పర్లకు సర్వీస్ ముగింపు ప్రయోజనాలకు బదులుగా, అంగన్‌వాడీ వర్కర్లకు లక్ష రూపాయలు, అంగన్‌వాడీ హెల్పర్లకు రూ.40 వేలు గ్రాట్యుటీగా చెల్లించడానికి ప్రభుత్వం అత్యవసరంగా జిఓ ఎంఎస్ నెంబర్.8 జారీ చేసింది. ర్యాటిఫై చేయడానికి మహిళాభివద్ధి, శిశు సంక్షేమం, సీనియర్ సిటిజన్ శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

చిత్తూరు జిల్లాలోని కుప్పం మండలం బైరుగానిపల్లె గ్రామంలో ఉన్న సర్వే నెం. 19/1లోని 7.74 ఎకరాల ప్రభుత్వ భూమిలో సివిల్ సెక్టార్‌లో కేంద్రీయ విద్యాలయ పాఠశాలను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు కేంద్రీయ విద్యాలయ సంఘస్థాన్ న్యూఢిల్లీ వారికి ఉచితంగా ఆ భూమిని అప్పగించేందుకు రెవిన్యూ శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది.

నారావారిపల్లి పిహెచ్సికి 50పడకల సామర్థ్యం

అంగన్వాడీల రిటైర్మెంట్ వయసు 62

రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు

నారావారిపల్లిలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకల సిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేయడానికి, ఎటువంటి ఆర్థిక చిక్కులు లేకుండా ఇప్పటికే మంజూరు చేయబడిన పోస్టుల స్థానంలో 18 అదనపు పోస్టుల కల్పనకై వైద్య ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది..చిత్తూరు జిల్లా కుప్పంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అభివద్ధి కోసం పిపిపి కన్సెషనర్ సేకరణను ప్రారంభించడానికి ఆంధ్ర ప్రదేశ్ విమానాశ్రయానికి ఆమోదం తెలిపింది.

టిడిపి కార్యాలయంపై ఉండే శ్రద్ధ

శెట్టిపల్లి పేదలపై లేదెందుకు..?

గుంటూరు నగరంలో టిడిపి కార్యాలయానికి 2954 చదరపు గజాల మున్సిపల్ భూమిని 33 సంవత్సరాల కాలపరిమితికి అద్దె ప్రాతిపదికన 99 సంవత్సరాల వరకు పొడిగింపు చేసుకుని రాష్ట్ర మంత్రి మండలి క్యాబినెట్‌లో ఆమోదం పొందింది. ఈ శ్రద్ధ శెట్టిపల్లి పేదలపై పెట్టి ఉంటే భూ సమస్య ఏనాడో పరిష్కారమయ్యేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి వ్యాఖ్యానించారు. గురువారం మంత్రి మండలి సమావేశంలోనైనా శెట్టిపల్లి భూముల గురించి చర్చిస్తారని, జీవోను విడుదల చేస్తారని ఎంతో ఆశగా పేదలు ఎదురుచూసినా నిరాశే కలిగిందన్నారు. ఆలస్యం చేయడానికి వెనుక ఉన్న ప్రయోజనాలు ఏంటో సంబంధిత మంత్రి ప్రజలకు వివరించాలన్నారు.

ప్రసంగిస్తున్న పి.హేమలత, రైతుసంఘాల నేతలు

మామిడికి రూ.12 గిట్టుబాటు ధర చెల్లించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

మామిడికి ప్రభుత్వం ప్రకటించినట్లు గుజ్జు యాజమాన్యం ఎనిమిది రూపాయలు, ప్రభుత్వం ప్రకటించిన నాలుగు రూపాయలు వెంటనే చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత డిమాండ్‌చేశారు. గురువారం పుత్తూరు మార్కెట్‌యార్డులో ఐదు మండలాల నుంచి వచ్చిన రైతులతో చిత్తూరు మామిడి సంక్షేమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. సంఘం కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పినట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం ఎనిమిది కాకుండా కేవలం నాలుగైదు రూపాయలు మాత్రమే చెల్లించాలని చూడటం దుర్మార్గమన్నారు. రైతుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. సంఘం గౌరవాధ్యక్షులు ఆనందనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రశ్నించపోతే న్యాయం జరగదన్నారు. ఐక్యంగా ముందుకెళ్లి సహకార రంగంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకుంటేనే న్యాయం జరుగుతుందన్నారు. రైతు నాయకులు యువరాజు మాట్లాడుతూ పోరాడి గిట్టుబాటు ధర సాధించుకోవాలన్నారు.

పి.హేమలత మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు చేసిన పోరాటం ప్రపంచంలోనే ఆదర్శవంతమైనదని, భవిష్యత్‌లో అలాంటి పోరాటానికి మనం సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గడ్డం సుబ్రమణ్యం యాదవ్, బాబునాయుడు, మురగారెడ్డి, పి.కేశవులు, వి.జయబాబు, జి.రఘమ్మ, సత్యనారాయణ రాజు, జయదేవమ్మ పాల్గొన్నారు.

'గోవిందా..' న్యాయం చేయి 'గోవిందా'..!

- శ్రీవారిమెట్టు వ్యాపారుల వినూత్న నిరసన
- నిరసనదీక్షలు ప్రారంభించి ఏడాది పూర్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'మా బాధ విను గోవిందా.. మా కష్టాలు చెప్పుకోవడం ప్రారంభించి ఏడాది పూర్తయ్యింది గోవిందా.. టిటిడి యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోలేదు గోవిందా..' అంటూ శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు వినూత్నంగా గురువారం నిరసన తెలిపారు. తమ దీక్షలు ప్రారంభించి 365 రోజులు పూర్తయిన సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి 'గుండు' కొట్టించుకుంటూ తలనీలాలను సామూహికంగా సమర్పించారు. తిరుమలేశుని నిలువెత్తు చిత్రపటం ముందు గోవిందనామ స్మరణ చేస్తూ, న్యాయం చేయాలని టిటిడికి విజ్ఞప్తులు చేస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. తలనీలాలను సమర్పించిన అనంతరం కపిలతీర్థంకు వెళ్లి స్నానాలు ఆచరించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ దీక్షలు చేపట్టి ఏడాది పూర్తయినా టిటిడి యాజమాన్యం కనికరించలేదన్నారు. పలుమార్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు, ఈవో శ్యామలరావుకు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరిలను కలిసి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. రోజురోజుకూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని, కూటమి ప్రభుత్వ పెద్దల గౌరవం పలచబడక ముందే సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

చిరు వ్యాపారులు బంగారు కుటుంబాలు కాదా : వి.నాగరాజు, సిపిఎం

పి4 పథకం పేరిట చంద్రబాబు బంగారు కుటుంబాలను ఆదుకుంటామని చేస్తున్న ప్రకటనలో వాస్తవం ఎంతో ఇలాంటి ఘటనల వల్ల అర్థమవుతుంది. బంగారు కుటుంబాల పేరిట పేదలను బలవంతులు చేయడానికి చంద్రబాబు చేస్తున్న కృషి నిజమైనదైతే శ్రీవారి మెట్టుచిరు వ్యాపారులను దత్తత తీసుకోవాలన్నారు. ఏడాదికాలంగా మొక్కవోని దీక్షతో పోరాడుతున్న వ్యాపారులను ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, వేణుగోపాల్, మాధవ్, బుజ్జి, తంజావూరు మురళి, రవి, మారిముత్తు, సాయిలక్ష్మి యూనియన్ నాయకులు మధు, చిట్టిబాబు, యుగంధర్, గణేష్, రాంబాబు, రామ్మూర్తి, మల్లి, నరసింహులు, ప్రకాష్, సోనూ, పెంచలయ్య పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పులిపేరుతో తరిమేశారు :చిరంజీవి



శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు రెండు దశాబ్దాలుగా ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నాం. పులి పేరుతో తరిమేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత షాపులు పెట్టనీకుండా చేశారు. అధికార పార్టీకి చెందిన వారికి మాత్రం షాపులు పెట్టుకోడానికి అనుమతి ఇచ్చారు. ఇది చాలా అన్యాయం. ఏడాదిగా టిటిడిపరిపాలనా భవనం వద్ద ఆందోళన చేస్తున్నా టిటిడి ఛైర్మన్, ఈవో పరిష్కరించలేదు. తమ కుటుంబ సభ్యులను ఎలా పోషించుకోవాలి. స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తాం.

ప్రభుత్వాలు మారితే షాపులు మార్చేస్తారు : లక్ష్మి



ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాలు మారినపుడు శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల షాపులను బలవంతంగా ఖాళీ చేయించడం, వారికి అనుకూలంగా ఉన్న వారికి షాపులు పెట్టుకోడానికి టిటిడి యాజమాన్యం అనుమతి ఇవ్వడం అన్యాయం. అప్పులు చేసి వ్యాపారాలు చేసుకుంటుంటే టిటిడి వాళ్లు ఉన్నపళాన షాపులను తొలగించి మాకు ఉపాధి లేకుండా చేశారు. ఏడాదిగా ఆందోళన చేస్తున్నా టిటిడికి కనీస మానవత్వం లేదు. తమ సమస్య పరిష్కరించకుంటే ప్రజాప్రతినిధులందరి సహకారంతో న్యాయం కోసం మరింత పోరాడతాం.

అప్పుల పాలయ్యాం : పెంచలయ్య

ఏడాదిపాటు ఉపాధి లేకపోవడంతో అప్పుల పాలయ్యాం. గతంలో షాపులు పెట్టుకోడానికి తీసుకొచ్చిన అప్పుల వడ్డీలు తడిచి మోపెడయ్యాయి. కుటుంబ పోషణ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. పిల్లలకు స్కూలు ఫీజులు, యూనిఫాం కొని ఇచ్చే పరిస్థితి లేదు. టిటిడి యాజమాన్యం శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల జీవితాలతో ఆటాడుకుంటోంది. సమస్యను నాన్చుడు ధోరణితో సాగదీస్తోంది. పులి సంచరిస్తుందని చెప్పి వ్యాపారులను ఖాళీ చేయించడం అన్యాయం. ఏడాదిగా దీక్ష చేస్తున్నా ఉన్నతాధికారుల నుంచి స్పందన కరువు.

అటవీకార్మికుల స్ఫూర్తితో ఉద్యమిస్తాం : ఉమామహేశ్వరి



అటవీ కార్మికులు దాదాపు మూడేళ్లపాటు పోరాడి తమ [illegible] సాధించుకున్నారు. వారి స్ఫూర్తితో మేం కూడా తగ్గేదేలేదు. తప్పకుండా మా షాపులు మాకు దక్కేవరకూ ఉద్యమిస్తాం. వ్యాపారులతో టిటిడి ఆటలాడుకుంటోంది. మా కుటుంబాలు అల్లాడిపోతున్నా కనీస కనికరం లేదు. మా దీక్షలు ప్రారంభమై ఏడాదైనా యాత్రికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు తప్ప, టిటిడి ఉన్నతాధికారులకు చీమకుట్టినట్లు లేదు. యాజమాన్యం స్పందించి న్యాయం చేయాలి.

అడుమానం పెడితే.. అమ్మేశారు!

అప్పు కట్టలేదని కుటుంబం గెంటివేత

తొండమనాడులో దారుణం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కుటుంబ అవసరాల కోసం ఇంటిని అడుమానం(తాకట్టు)పెడితే అమ్మేశారు.. కుటుంబాన్ని ఇంటి నుంచి గెంటేశారు..ఈ దారుణమైన ఘటన శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని తొండమనాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకోగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు వివరాలు.. స్థానిక గ్రామానికి చెందిన మహాదేవరెడ్డి, మునిరాజమ్మలకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం చేసేందుకు 2016లో అదే గ్రామం, అదే సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి వద్ద మహాదేవ రెడ్డి రూ. లక్ష అప్పు తీసుకున్నాడు. కొన్నేళ్లు గడిచాక అదే ఇంటిపై మరో లక్ష అప్పు తీసుకున్నాడు. ఈ క్రమంలో అప్పు తీర్చలేదని సదరు వ్యక్తి ఆ ఇంటిని మహాదేవ రెడ్డి కుటుంబానికి తెలియకుండా ఓ మహిళకు విక్రయించాడు. సదరు మహిళ ఆ ఇంటిని మరో వ్యక్తికి విక్రయించింది. చివరగా ఆ ఇంటిని కొన్న వ్యక్తి బుధవారం మహదేవ రెడ్డి కుటుంబం పై దౌర్జన్యానికి దిగాడు. ఇంట్లోని సామగ్రి, దుస్తులు బయటకు విసిరి, కుటుంబ సభ్యులను బయటకు గెంటేశాడు. చివరకు పోలీసు స్టేషన్ మెట్లెక్కినా తమకు న్యాయం జరగలేదనీ, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డే తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబం వాపోయింది.



తిరుపతిలో వి.ఎస్. భరద్వాజ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ ప్రముఖ సంగీత విద్వాంసులు వి.ఎస్. భరద్వాజ్‌కు ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ, పాండిచ్చేరి వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా, వారి శిష్యులు తిరుపతి, నట శిక్షణాలయం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిష్య బందంలోని బత్తిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కేశవ, చంద్ర, తిరుపాలాచారి, వెంకటాద్రి, రామలింగేశ్వర కుమార్, ప్రదీప్, సంతోష్, యువరాజు, మధుసూదన్ రాజు, యశోద, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సినీ ప్రముఖులకు చక్రధర్ వీడ్కోలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి తిరుమల వెంకన్నను దర్శించుకున్న అనంతరం హైదరాబాద్ కు బయలుదేరిన పలువురు సినీ ప్రముఖులకు స్థానిక రేణిగుంట విమానాశ్రయంలో జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ వీడ్కోలు పలికారు. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, హీరో నాగచైతన్యలు గురువారం తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు. అనంతరం చక్రధర్ వీరిని మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. సాదర వీడ్కోలు పలికారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌సిసి విస్తరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌సిసి విస్తరణకు ప్రయత్నం చేస్తామని ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలానీ పేర్కొన్నారు. తిరుపతిలోని ఎన్‌సిసి నగర్‌లోని క్యాంప్ కార్యాలయం సందర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత తిరుపతి ప్రధాన కేంద్రంగా ఎన్సిసి కార్యక్రమాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయన్నారు. ఆఫీసర్ల సంఖ్య, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఎన్సిసి కార్యక్రమాలపై విద్యార్థులకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా, ఎన్సిసి అధికారులు, సిబ్బంది బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌చంద్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, సివిల్ ఇంజనీరింగ్ విభాగపు పరిశోధక విద్యార్థి ఎమ్.ఎమ్. ప్రేమ్ చంద్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సిఈ రాజమాణిక్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, పాండురంగవారి పల్లి గ్రామ నివాసి ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం ఎం నాయుడు, మన్నవ సత్యవతిల కుమారుడు ప్రేమ్ చంద్ ఆచార్య ఐవి రమణారెడ్డి పర్యవేక్షణలో "బిహేవియర్ ఆఫ్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్ ఆన్ అడిషన్ ఆఫ్ సప్లిమెంటరీ సిమెం టిటియస్ మెటీరియల్స్ ఇన్ ఓ.పి.సి, పి.పి.సి అండ్ పి.ఎస్.సి సిమెంట్స్ ఆట్ డిఫరెంట్ డ్యూరేషన్ ఆఫ్ మిక్సింగ్" అనే అంశం పై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఇందుకుగాను ఆయనకు డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసినట్లు వివరించారు. ప్రేమ్ చంద్ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లలో అనేక పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఈ సందర్భంగా ప్రేమ్ చంద్‌కు పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

100 రోజులు పని కల్పించాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, తిమ్మాభూపాలపురం పంచాయతీలో జరుగుతున్న ఫారమ్ పాండ్ పనులను పథక సంచాలకులు గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడుతూ మాట్లాడారు. కొలతల ప్రకారం పని చేసి 300 రూపాయలు రోజువారీ వేతనం పొందాలని పథక సంచాలకులు సి.వి.శ్రీనివాస ప్రసాద్ తెలియజేసారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశువులు ఉన్న రైతులు వెటర్నరీ డిపార్ట్మెంట్‌కు దరఖాస్తు చేసుకుంటే అర్హతలను పరిశీలించి వారు మండల పరిషత్ అభివృద్ధి అధికారికి మినీ గోకుల కేటాయింపుకు ప్రతిపాదన పంపుతారని తెలిపారు. అనంతరం రైతులకు ఇస్తున్న పళ్ళ, పూల తోటల వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధికారులు డి. చంద్రశేఖర్ రాజు, అవిలాల దేవరి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ భానుశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్లు రవీంద్రుడు, మధుసూదన్, కుమార్, ఉపాధి హామీ శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని కాపాడండి

తహశీల్దార్ భారతికి బాధితుల వినతి పత్రం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): తొట్టంబేడు మండలం, చేమూరు పంచాయతీ హరిజనవాడలో నివాసముంటున్న మాదమాల వెంకటలక్ష్మికి 2013లో అధికారంలో ఉన్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ పంపిణీ విధానంలో చేమూరు రెవెన్యూ లెక్క దాఖలు సర్వేనెంబర్ 308-డి లో ఒక ఎకరా 68 సెంట్లు ప్రభుత్వ భూమిని పంపిణీ చేసింది. అది మెట్ట భూమి కావడంతో అందులో ఉలవలు పండించుకుంటూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే కొంతకాలంగా తమిళనాడుకు చెందిన రవి రాజు అనే వ్యక్తి జెసిబితో తమ భూమిలోని చెట్లను తొలగిస్తూ, దౌర్జన్యంగా ఆక్రమించు కోవడానికి ప్రయత్నించేస్తున్నాడంటూ సిపిఎం పార్టీ నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్యల ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ పి.భారతికి వినతి పత్రం అందజేశారు. వారి నుంచి తమ భూమిని కాపాడాలని ఎమ్మార్వోను కోరారు. స్పందించిన ఎమ్మార్వో అక్రమ చొరబాట్లపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జీవో నెంబర్ 42 ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది జీవో నెంబర్ 42ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్త ప్రభుత్వ డిగ్రీ అధ్యాపకుల సంఘాలు, జిసి, జిటిఏ, జిసిటిఏ సంఘాలు కలిసి సంయుక్త కార్యాచరణ సమితి జేఏసీగా ఏర్పడి ఇచ్చిన పిలుపుమేరకు ప్రభుత్వ అధ్యాపకులు ఆగస్టు 7నుండి మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలపుతున్నారు. డిగ్రీ అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి బదిలీలు చేపట్టాలని, జీవో నంబర్ 42ను రద్దు చేయాలని, యుజిసి నిబంధనల మేరకు రీడేసిగ్నేషన్ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని నినాదాలు చేశారు. విజయవాడలో 29న నిర్వహించే ధర్నాలో అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అధ్యాపక సంఘ నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, డాక్టర్ సి.వెంకట కృష్ణయ్య, డాక్టర్ పి.సుజన, డాక్టర్ సాంసన్ రాజు, డాక్టర్ సురేష్ బాబు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

భూమన క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భూమన కరుణాకర్ రెడ్డికి జైలు ఊసలు లెక్కపెట్టే సమయం దగ్గర పడిందని టీడీపీ మీడియా రాయలసీమ కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ హెచ్చరించారు. ఎంతో భక్తి భావంతో శ్రీవారి సేవ చేస్తున్న టీటీడీ చైర్మన్‌పై అసత్య ప్రచారం చేయడం, అసభ్యకర వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని, భూమన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నట్లు చెప్పారు. భూమన ఇకనైనా తన వ్యవహార శైలి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుని విమర్శించే అర్హత భూమనకు లేదన్నారు.

స్కిట్ నుంచి తిరుపతికి ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి నుంచి స్కిట్ ఇంజినీరింగ్ కళాశాలకు రాకపోకలు సాగించేందుకుగాను ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించారు. రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు సుబ్బయ్య గురువారం బస్సును ప్రారంభించారు. స్కిట్ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రయాణ సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు.

ట్రెజరీ కార్యాలయమా.. ఎక్కడ నీ చిరునామా..?

- వృద్ధులు, వికలాంగుల వెతుకులాట
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- మొదటి అంతస్తుకు ఎక్కలేక తిప్పలు
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల అసహనం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మాకు పెన్షన్ తీసుకోవడమే కష్టమైపోయింది. కార్యాలయం ఎక్కడుందో అడుగుతూ తిరగాలి, చేరినా పై అంతస్తులో మెట్లు ఎక్కాల్సి వస్తోంది. ఈ వయసుతో, కాళ్ల నొప్పులతో ఎలా ఎక్కగలమని ఆవేదనతో వ్యక్తపరస్తున్నారు పలువురు వృద్ధులు. పుత్తూరులో ట్రెజరీ (ఉపఖజానా) కార్యాలయం ఈ విధంగా గుర్తు తెలియని స్థితిలో ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో సుమారు 30 సంవత్సరాలు పాటు తహశీల్దార్ కార్యాలయంలో నడచిన ఈ కార్యాలయం, ఆపై మోర్ మార్కెట్టు దగ్గర, ఆటు తర్వాత ఆర్డియం థియేటర్ దగ్గర కొంతకాలం కొనసాగి, ప్రస్తుతం శివాలయం ఎదురుగా ఉన్న ఒక సందులోని మిద్దెపై కొనసాగుతోంది. కానీ మారిన చోటుకి స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు కార్యాలయం ఎక్కడుందని వెతుక్కోలేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పెన్షన్లు పొందే వృద్ధులు, వికలాంగులు కార్యాలయం చేరుకోవడానికి నానా కష్టాలు పడుతున్నారు. నిత్యం ఈ కార్యాలయానికి ఎన్నో పనుల మీద వచ్చేవారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగిరి నియోజకవర్గంలో రెండు మున్సిపాలిటీలు ఉన్నప్పటికీ ట్రెజరీ కార్యాలయం సొంత భవనానికి నోచుకోక, అటు ఇటు మారుతుండడం ఏమిటని ప్రజలు విమర్శిస్తున్నారు. కనీసం వృద్ధుల సౌకర్యార్థమైనా పై అంతస్తుల్లో కాక, కిందే కార్యాలయం ఏర్పాటు చేయాలని, కార్యాలయం చిరునామా తెలుపుతూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పంబలేరు వంతెన త్వరలో పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే పాశం

పంబలేరు వాగు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పంబలేరు బ్రిడ్జి నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేసి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు - నెల్లూరు రహదారిలో గూడూరు పట్టణ శివారు ప్రాంతంలో ప్రవహిస్తున్న పంబలేరు వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి గత తెలుగుదేశం ప్రభుత్వం 18 కోట్ల రూపాయల నిధులతో శ్రీకారం చుట్టారు. అయితే బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో పాటు అప్రోచ్ రోడ్డు అధ్వానంగా తయారవడంతో ఎమ్మెల్యే ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందని, ఆనాటి బ్రిడ్జి నిర్మాణ వ్యయం 18 కోట్ల రూపాయలు అవుతుందని అధికారులు నిర్ణయించారని, అయితే ఇప్పటికీ అసంపూర్తిగా ఉండడంతో దీనిని పూర్తిచేసేందుకు అధికారుల ద్వారా ఎస్టిమేషన్ వేయించగా సుమారు 9 కోట్ల రూపాయల నిధులు అదనంగా అవసరం అవుతాయని తెలపారన్నారు. ఈ విషయం రోడ్డు రవాణా శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి 9 కోట్ల రూపాయలను మంజూరు చేయించి విడుదల చేయిస్తానని, త్వరలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ క్రమంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అప్రోచ్ రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారనిమరమత్తు పనులు చేస్తున్నామని వాహనదారులకు తాత్కాలికంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తానని తెలిపారు. ఈ కార్యాక్రమంలో ఆయన వెంట స్థానిక టిడిపి నాయకులు, అభిమానులు ఉన్నారు.

అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్ శ్రావణ్ కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ.పి.టి.డి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు, ఆర్టీసీ డిపో కార్యాలయం ఎదుట గురువారం ఏపీ.పి.టి.డి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు రీజనల్ వైస్ ప్రెసిడెంట్ వెంకయ్య మాట్లాడుతూ, చిన్న పొరపాటుకి కండక్టర్ శ్రావణ్ కుమార్‌ను సస్పెండ్ చేయడం తగదని, 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, డిపో మేనేజర్ మొండి వైఖరిని మానుకోవాలని, లేని పక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ ప్రవీణ్, సెక్రటరీ శ్రీనివాసులు, ట్రెజరర్ గౌస్, గ్యారేజీ సెక్రటరీ ప్రవీణ్, కమలాకర్, కరీముల్లా, వెంకటేశ్వర్లు, సందాని, బాబు, రమేష్, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం రెడ్డికి కిలివేటి నివాళి



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేటకు చెందిన చిల్లకూరు.బాలకృష్ణారెడ్డి తండ్రి, చిల్లకూరు సుబ్రహ్మణ్యం రెడ్డి(అబ్బయ్య రెడ్డి) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం తుది శ్వాస విడిచారు. సూళ్లూరుపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, నాయుడుపేటకు చెందిన వైసీపీ నాయకులతో కలిసి పట్టణంలోని బిఎంఆర్ నగర్‌లో గల బాలకృష్ణారెడ్డి నివాసానికి చేరుకుని అబ్బయ్య రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాలకృష్ణ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కామిరెడ్డి రాజారెడ్డి, పాదర్తి హరినాథ్ రెడ్డి, కటకం జయరామయ్య, కౌన్సిలర్ షేక్ షబ్బీర్ మరి కొందరు నాయకులు నివాళులర్పించారు.

వాకాడులో కలెక్టర్ పర్యటన



ప్రజాశక్తి - వాకాడు: వాకాడులో గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పర్యటిం చారు. మొదటిగా స్వర్ణముఖి బ్యారేజ్‌ని సందర్శించారు. స్వర్ణముఖి బ్యారేజీ సముద్ర తీరానికి దగ్గరగా ఉన్నందున, నిర్వహణ లోపంతో బ్యారేజీ గేట్లు తొంద రగా దెబ్బతిన్నాయని, గేట్ల మరమ్మత్తులకు మూడు కోట్ల రూపాయలు ఖర్చువుతుందని, ప్రతి సంవత్సరం గేట్ల నిర్వహణకు 10 నుండి 15 లక్షలు వరకు ఖర్చుఅవుతుందని దానికి సంబం ధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందించామని తెలిపారు. అనంతరం వాకాడులో నూత నంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి, ఎక్స్రే రూమును ప్రారంభించారు. మం దులు, మిషనరీ గురించి రోగులు బాగోగులు గురించి ఆరా తీసి ఉపయోగంలో లేని మిషన రీని వేరే ఆసుపత్రికి తరలించాలని అధికారులను సూచించారు. ఆసుపత్రి నిర్వహణలో చొరవ చూపిస్తున్నటువంటి డాక్టర్ రోహిత్‌ను, ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలోకి వాకాడు గ్రామస్తులు కలెక్టర్‌కు హరిజనవాడ సమస్యలపై అర్జీ సమర్పించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ.. ప్రజాశక్తి - చిట్టమూరు: తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ గురువారం చిట్టమూరు మండల కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాకాడు నుంచి తిరుపతి వెళుతూ మార్గమధ్యంలో చిట్టమూరు మండలంలోని కోగిలి చెరువుకు తెలుగు గంగ కాలవ ద్వారా వెళుతున్న నీటి కాలవను సందర్శించి, అందులో 400 మీటర్లు పరిధిలో ఎల్ఏకి ఇచ్చిన స్థలంలో ఉన్న సమస్యను పరిష్కార నిమిత్తం అధికారులతో చర్చించారు. వారి వెంట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, తెలుగు గంగ అధికారులు, మండల తహశీల్దారు కాయల సతీష్ కుమార్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఆర్.ఐ.సుధ అధికారులు పాల్గొన్నారు.

67 మంది సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీస్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సచివాలయ కార్యదర్శులు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలేదని కమిషనర్ మౌర్య 67 మందికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. గతం వారం 281 మందికి నోటీస్ ఇచ్చిన విషయం తెలిసిందే. సచివాలయ కార్యదర్శులు వర్క్ టు హోం సర్వే తో పాటు కౌసల్య సర్వే చేసినందుకు 1964 చట్టం ప్రకారం వారికి నోటీసు జారీ చేశారు. దీనిపై అసోసియేషన్ నేతలు మండిపడుతున్నారు. అధికారులు కావాలనే తమను ఇబ్బంది గురి చేసేందుకు టార్గెట్లు ఇచ్చి సర్వే చేయని వారిపై చర్యలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు టి.సుబ్రహ్మణ్యం ప్రకటనలో డిమాండ్ చేశారు.

మున్సిపాలిటీకి మహర్దశ తీసుకొస్తాం : బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి మహర్దశను తీసుకురానున్నామనీ, కార్పొరేట్ స్థాయిలో అభివద్ధి పరచనున్నామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన పారిశుద్ధ్య విభాగ కార్మికులకు దుస్తులు, పారిశుద్ధ్య కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు అధునాతన యంత్రాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ అభివద్ధి పథంలో నడిచేందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి తీసుకొస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు విజయ్ కుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: రాష్ట్రంలో చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించా లన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ క్రమంలో జాబ్ మేళాలు నిర్వహించడం జరుగుతుందని చదువుకున్న యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. గురువారం గూడూరు, దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌లు పాల్గొన్నారు. జాబ్ మేళాను కలెక్టర్ ప్రారంభించి ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా జాబ్ మేళాలు నిర్వహిస్తూ అర్హత కలిగిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘు వేంద్ర మీనా, గూడూరు డిఎస్పి గీతా కుమారి, డి.ఆర్.డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హను మంత రావు, డాక్టర్ జనార్ధన్ రెడ్డి, యలవర్తి విద్యాసాగర్ రావు, కంపెనీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

శ్రీరామలో ఘనంగా ఓరియెంటేషన్ డే

ఓరియెంటేషన్ డే లో మాట్లాడుతున్న అరవింద్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఘనంగా ఓరియెంటేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ వి.వాసుదేవరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడు తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, జ్ఞానమే తరగని సంపదన్నారు.కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థిని, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల మీద నమ్మకంతో తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రబాబూ! సీనియర్ జర్నలిస్టులను పట్టించుకోండి

సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డా.టి.జనార్దన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నెలా రూ.4000 చొప్పున 60 లక్షల మందికి పైగా రాష్ట్రంలోని వృద్ధులకు సామాజిక ఫించన్లు అందజేస్తున్నారని, ఇంతటి సంక్షేమం కల్పిస్తున్న సీఎంకు రాష్ట్రంలో 500 మందిలోపు ఉన్న సీనియర్ జర్నలిస్టులకు ఫించన్ సౌకర్యం కల్పించక పోవడం శోచనీయమని ఏపీ వెటరన్ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు డా.టి.జనార్దన్ వాపోయారు. త్రివేంద్రంలో కేరళ సీనియర్ జర్నలిస్టుల ఫోరం నిర్వహించిన జాతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 రాష్ట్రాల్లో వెటరన్స్‌కు ఫించన్ ఇస్తున్నారని, దేశంలోనే విజన్ వున్న నాయకుడు, సంక్షేమంలో ముందుండే సీయం చంద్రబాబు అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా సీనియర్ జర్నలిస్టులను పట్టించుకోక పోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా ఫించన్ అమలు చేసిన కేరళ ప్రభుత్వం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని ప్రశంసించారు. గతంలో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల సంక్షేమ నిధి వేరే అవసరాలకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో ఆ నిధి నుంచి సీనియర్ జర్నలిస్టుల కుటుంబాలను ఆదు కుంటుందన్నారు. ఏపీలో సైతం పునరుద్ధరించి వెటరన్ జర్నలిస్ట్‌ల సంక్షేమానికి ఉపయోగించాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఇన్సూరెన్ పథకం సక్రమంగా అమలు కావడంలేదని జర్నలిస్టుల సంక్షేమం నిధిని ఏపీలో ఏర్పాటు చేయాలన్నారు. ఏపీ వెటరన్ జర్నలిస్ట్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు కడప జిల్లా బద్వేల్‌కు చెందిన ఎస్ ఎస్ పి.మణి కుమార్ ఆకలి చావుకు గురవడం తో వారి కుటుంబం దయనీయ స్థితికి రావడం దారుణమన్నారు. అలాంటి పరిస్థితి ఇకపై ఏ సీనియర్ జర్నలిస్టుకు రాకూడదన్నారు.అందుకే సమగ్ర ఫించన్ పథకం ఏర్పాటుకు ఈ మహా సభ పోరాడాలని పిలుపు ఇచ్చారు.

చవితికి అశ్లీల ప్రదర్శనలు బంద్ : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో బ్రహ్మాండంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, వినాయకసాగర్‌లో నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశించారు. నగరంలో వినాయక చవితి నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, వరసిద్ధి వినాయక నిమజ్జన కమిటీ సభ్యులతో కమిషనర్ సమావేశమై సమీక్షించారు. వినాయక చవితి, నిమజ్జనంలో ఆయా విభాగాల అధికారులు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్డు పరిశీలన

నగరపాలక సంస్థ పరిధిలోని గోదా దేవి మార్గంలో భూమి.కోల్పోయిన వారి స్థలాలను గురువారం సాయంత్రం కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారికి టిడిఆర్ బాండ్లు మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేంకు బుధవారం ఆన్లైన్ ద్వారా అధికారులు దరఖాస్తులను పరిశీలించారు. అందులో భాగంగా గురువారం సాయంత్రం కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలసి గోదా దేవి మార్గంలోని 10 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించారు.

IN THE COURT OF THE X ADDITIONAL DISTRICT JUDGE: TIRUPATI
A.S.NO.60 / 2023

C.P.Govindaraju ...Appellant
V/s
B.Muralidhar Babu, & 2 Others ...Respondents

APPEAL NOTICE TO RESPONDENT NO.2

R2) Suraparaju Udaya Vikram, S/o S.Subramanyam Raju, Rachapalem-Village, Puttur Mandal, Chittoor District,

The above appeal which was preferred by the appellant/ 1st Defendant against you aggrieved against the Judgment and Decree of the Learned Principal Senior civil Judge, Tirupati made in O.S.No.701 of 2014 dated 21st day of March 2023 is stands posted to 10-09-2025 for your appearance either in person or through Advocate to raise objections if any, else the matter will be decided exparte.

P.HEMACHANDRA REDDY
Advocate
19-45-S9-236, BAIRAGIPATTED, TIRUPATI

కనుపడుటలేదు

పైన కనిపిస్తున్న వ్యక్తి పేరు **రాజ్ కిషోర్.** ఈయన గత నెల అనగా 8-7-2025 మంగళవారము నుండి కనిపించడం లేదు. ఈయన ఎక్కడ అయినా కనిపిస్తే ఈ నెంబరుకు ఫోన్ చేసి చెప్పవలసిందిగా కోరుతున్నాము ఫోన్ :-**6302822436**
ఆచూకీ తెలిపిన వారికి తగిన బహుమతి ఇస్తాము
ఇట్లు... **కుటుంబ సభ్యులు**

క్రైం న్యూస్

రహస్య తవ్వకాల్లో ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని ఆలత్తూరు గ్రామపంచాయతీలో గ్రామ శివారులోని ఉమామహేశ్వర్ రెడ్డి పొలంలో గుప్త నిధులు ఉన్నాయనే అనుమానంతో ప్రతిరోజు రాత్రి సమయంలో రహస్యంగా తవ్వకాలు చేసిన ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తవ్వకాలను పొలం కాపలాదారు గుర్తించి యజమానికి సమాచారం ఇచ్చాడు. జెసిబితో గుంతల తవ్వుతున్న సమాచారం అందుకున్న సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు, సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య ఘటనా స్థలానికి చేరుకుని ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జెసిపిని సీజ్ చేసి, ఏడు మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): శేషాచలం అటవీ పరిధి ప్రకాశం జిల్లా గిద్దలూరు ఫారెస్ట్ డివిజన్‌లో ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 26 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ నరేష్ బృందం బుధవారం రాత్రి నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు ఫారెస్ట్ రేంజ్ లోని బెస్తవారిపేట అటవీ పరిధిలో కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. వీరు గుంతపల్లి బీటు పరిధి చేరుకొనే సరికి అక్కడ ఒక మోటారు సైకిల్ వద్ద కొంతమంది వ్యక్తులు గుమికూడి ఉండడాన్ని గమనించామన్నారు. వారిని సమీపించడంతో పారిపోతుండగా వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వారిచ్చిన సమాచారంతో అక్కడే కల్వర్టు కింద దాచిన 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడ్డ వీరు ప్రకాశం జిల్లా వాసులుగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏసిఎఫ్ శ్రీనివాస్ స్మగ్లర్లను విచారించారని, హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఎస్డికె నగర్‌లో దొంగల బెడద

మాయమైన ట్రాక్టర్ బ్యాటరీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ఎస్డికె నగర్‌లో దొంగల సంచారం అధికమైందనీ, అడుకట్టు వేయాలంటూ స్థానికులు పోలీసులను కోరారు. వారం కిందట ఓ పాడి రైతుకు చెందిన రెండు పొట్టేళ్లను ఎత్తుకెళ్లగా, బుధవారం రాత్రి ఆపి ఉన్న ట్రాక్టర్ ఇంజిన్‌లో విలువైన బ్యాటరీని తస్కరించారని స్థానికులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. యువకుడు మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి యువకుడు మృతిచెందిన ఘటన పట్టణంలోని తెట్టు సమీపంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. జైహింద్ పురానికి చెందిన కుమార్ (28) కాగితాలపురంలో అమ్మవారి కొలుపుకు వెళ్లి తిరిగి వస్తూ కాలినడకన రేణిగుంట-నాయుడుపేట రోడ్డును దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

నగరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సీఎం చంద్రబాబును నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ గురువారం అమరావతి సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, నగరి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నేత కార్మికులకు ఉచిత విద్యుత్‌పై సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. నగరి రూరల్, అర్బన్, విజయపురం, నింద్ర మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని కోరారు. కోసలనగరం పారిశ్రామిక కేంద్రం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. గాలేరు-నగరి ప్రాజెక్ట్‌కు సంబంధించి పుత్తూరులో ఉన్న వేణుగోపాల సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. సీఎం సహాయనిధి మంజూరుకు వచ్చిన విజ్ఞప్తులను అందజేశారు. పార్టీ కార్యకలాపాలపై సమీక్షించారు. నగరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తెలిపారు.

మహిళల ఎదుగుదలకు చేతివృత్తులే భరోసా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహిళల ఆర్థిక ఎదుగుదలకు చేతివృత్తిలే అతిపెద్ద భరోసా అని జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ డాక్టర్ ఎం మోహన్ అన్నారు. పానగల్‌లోని రాస్ మహిళా వాణి కార్యాలయంలో గురువారం ఉచిత బ్యూటీషియన్ కోర్స్ ప్రారంభించారు. జెఎస్ఎస్ ద్వారా ప్రతి సంవత్సరం 90 బ్యాచులకు వృత్తి శిక్షణలను ఉచితముగా అందించి, కేంద్ర ప్రభుత్వం ద్వారా సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణా సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి , మీనా, రాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సీఎంఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం సాయంత్రం తన నివాసంలో అందచేశారు. 17వ డివిజన్ పరిధిలోని దాసరిమఠంకు చెందిన బాబురావుకి, 38వ డివిజన్ పరిధిలోని సింగాలగుంటకు చెందిన చైతన్య సాయికి చెక్కులను అందించారు. బాధితులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE:: GUDUR
I.A.No. 732/2024
O.S.No.308/2022

Yanati Madhuri Latha Rep. by her GPA Yanati Sreedhar Reddy, ... **Petitioner/Plaintiff**
Vs
1. Polisetty Bhavani @ Jonnalagadda Bhavani, W/o. Jonnalagadda Malyadri D.No. 23-3-212, Krishna Residence, Sodhan Nagar, Nellore.
2. Peerisetty Srinivasulu, Slo. Masthanaiah, Thocham Village, Sydapuram Mandal, SPSR Nellore Dist., ... **Respondents (Defendants)**

నోటీసు

పై పేర్కొన్న వాది, ప్రతివాదులైన మీపై గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో బాకీ రాబట్టు నిమిత్తం పై కేసును దాఖలు చేసి యున్నారు. మరియు వాది యొక్క జనరల్ పవర్ ఆఫ్ అటార్నీగా ఉండుటకు పై నెంబరు పిటిషను దాఖలు చేసి ఉన్నారు. కావున మీకు తెలియజేయుట ఏమనగా దావాను పిటిషను మీ నోటీసు నిమిత్తం తె. 08-09-2025 ది. వాయిదా వేసి ఉన్నది. కావున మీరు గాని మీ తరపు న్యాయంవాది గాని పై కోర్టు ముందు ఉదయం10-30 గం॥ హాజరై ఆక్షేపణాలు తెలుపవలసినది. లేనిచో మీకు పరోక్షముగా కోర్టు వారు తీర్మానించుదురని ఈ నోటీసు ద్వారా మీకు తెలియ జేయుచున్నాము.

ఇట్లు
పి.వి. సాయి కుమార్ రెడ్డి, B.A., B.L.,
వాది తరపు న్యాయవాది